ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 29.05.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు.

2. రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

3. కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన విద్యార్థుల డైట్ ఛార్జీలను ప్రతి నెలా మొదటి వారంలోనే అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

4. వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**గవర్నర్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. గిరిజనుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మధ్యాహ్నం మూడు గంటలకు కొమరం భీం జన్మస్థలమైన రౌటసంకేపల్లిలో ఏర్పాటుచేసిన సభలో గవర్నర్ పాల్గొంటారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

**టీపీసీసీ**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో టీ-కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ ఈ సాయంత్రం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సమావేశం కానుంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు , ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు , SIR అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు అగ్రనేతలు, మంత్రులు ఈ భేటీలో పాల్గొంటారు.

**HYD –PTC**

**కిషన్ రెడ్డి**

రాబోయే అయిదేళ్లలో కాజీపేటలో ఉన్న రైల్వే తయారీ యూనిట్లో 200 ఇంటర్ సిటీ రైళ్లు తయారు కానున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రకటనపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి , రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఎక్స్**

**చెక్ పోస్ట్**

మహబూబాద్ జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు ల్లో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్ పోలీసులకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ హైవే పై స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ ను నిన్న రాత్రి ఎస్పీ తనిఖీ చేశారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల దగ్గర క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని, డ్రగ్స్, మత్తు పదార్థాలు , గంజాయి, పశువుల రవాణా పై అప్రమత్తంగా ఉండాలని , పట్టుబడిన వారిపై కఠిన కేసులు నమోదు చేయాలని సూచించారు.

**మహబూబాబాద్ జిల్లా - పి.టి.సి.**

**ఉత్తమ్ కుమార్ రెడ్డి - వరంగల్**

రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 58 లక్షల మెట్రిక్ టన్నుల

ధాన్యాన్ని సేకరించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మరో 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌కు అవసరమైన 24 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు తెలిజేశారు. జూన్ 4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో , జూన్ 3వ తేదీలోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ సూచించారు.

**బైట్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**వరంగల్ జిల్లా పీటీసి**

**పీఎం సూర్యఘర్**

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంలో భాగంగా ఖమ్మం జిల్లాలో కల్లూరు మండలంలోని చిన్న కోరుకొండి గ్రామాన్ని , ఎర్రుపాలెం మండలంలోని రాజుపాలెం గ్రామాన్ని సౌర ఆదర్శ గ్రామా లుగా సిద్దం చేస్తున్నారు. ఒక్కొక్క గ్రామానికి కోటి రూపాయల చొప్పున నిధులను మంజూరు చేశారు. ప్రతి ఇంటిపైన సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకొనేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకం వల్ల పొందుతున్న ప్రయోజనాల గురించి లబ్ధిదారు చౌడవరపు కిషోర్ గుప్తా ఆకాశవాణికి వివరించారు.

**Sound Byte. చౌడవరపు కిషోర్ గుప్తా**

**PTC, khammam**

**జీఆర్ఎంబీ ఛైర్మన్**

నాగార్జునసాగర్ జలాశయాన్ని గోదావరి నది నిర్వహణ బోర్డు చైర్మన్ పద్మ దోర్జే గ్యాంబ నిన్న సందర్శించారు. ప్రధాన డ్యాం , కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ , ప్రధాన విద్యుత్తు కేంద్రం , ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్ , తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్వహణ, నీటి నిల్వలు తదితర అంశాలపై అధికారులు ఛైర్మన్‌కు వివరించారు.

**పీటీసీ నల్లగొండ జిల్లా**

**అడ్లూరి లక్ష్మణ్**

కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన విద్యార్థుల డైట్ ఛార్జీలను ప్రతి నెలా మొదటి వారంలోనే అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీల ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈరోజు మంత్రి విడుదల చేశారు. ఈనెల 15న జరిగిన జేసీ సెట్ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరుకాగా , మొదటి విడతలో 18,401 మంది సీట్లు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 229 గురుకుల కాలేజీల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు జూన్ 7వ తేదీలోపు సంబంధిత కాలేజీల్లో చేరాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య , ఆహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

**పీటీసీ – హైదరాబాద్**

**ఈసెట్ , పీజీ ఈ సెట్**

టీజీ ఈ సెట్ పరీక్షా ఫలితాలు ఈ రోజు మధ్యాహ్నం విడుదల కానున్నాయి. పాలిటెక్నిక్, బీఎస్సీ విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ రెండో ఏడాదిలో చేరేందుకు ఈ నెల 15న ఈ సెట్ నిర్వహించారు. ఫలితాలను ఈసెట్ అధికారిక వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

అలాగే ఎంటెక్ , ఎంఫార్మసీ , ఎంఆర్క్ కోర్సుల్లో చేరేందుకు పీజీ ఈసెట్ ఆన్లైన్ పరీక్షలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. జూన్ 1 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి.

**డెస్క్**

**వాతావరణం**

వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయని అంచనా వేసింది. పెద్దపల్లి , జయశంకర్ భూపాలపల్లి , ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట తదితర జిల్లాల్లో ఉరుములు మెరుపులు , ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది.

**పీఎస్**

**ధాన్యం-రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ పేర్కొన్నారు.

తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు.

**బైట్ : కలెక్టర్ గరిమ అగర్వాల్**

**పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

**కామారెడ్డి - ధాన్యం**

కామారెడ్డి జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు సరైన మద్దతు ధర అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి, మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని మిల్లర్లను ఆదేశించారు.

**PTC - కామారెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం - ధాన్యం**

అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసినప్పటికీ కొనుగోలు చేస్తామని , ఈ విషయంలో రైతులు ఆందోళనకు గురికావొద్దని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలియజేశారు. దీనికోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ వ్యవస్థను సిద్ధం చేసిందని వెల్లడించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు

**పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం**

**కరీంనగర్-ధాన్యం కొనుగోళ్లు**

కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని , రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అధికారులను ఆదేశించారు. నిన్న జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్ల పురోగతి , రైతులకు చెల్లింపులు , మిల్లులకు ధాన్యం తరలింపు తదితర అంశాలపై అధికారులు , రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 115 కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ పూర్తయ్యిందని , మిగతా కేంద్రాల్లో కూడా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని స్పష్టం చేశారు.

**పిటిసి, కరీంనగర్**

**ఒపీనియస్**

ఆకాశవాణి 90 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో హైదరాబాద్ రామంతపూర్‌కు చెందిన ఉపాధ్యాయిని రామగీత రేడియోతో తనకున్న అనుబంధం గురించి తెలియజేశారు.

**సౌండ్ బైట్: రామ గీత**

**పీటీసీ మేడ్చల్ మల్కాజిగిరి**

**ప్రత్యేక ప్రజావాణి**

నల్లగొండ జిల్లాలో ప్రతినెల చివరి శనివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సంక్షేమ వారోత్సవాలలో భాగంగా రేపు దివ్యాంగులు , వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

**పీటీసీ నల్లగొండ జిల్లా**

**ఎమ్మెల్యే మురళీ నాయక్**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఫలాలు క్షేత్రస్థాయిలో అందే విధంగా కృషి చేస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఆదివాసి గ్రామమైన దొరవారి తిమ్మాపురం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ గ్రామంలో రహదారులు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని, ఉపాధి హామీ పనులు గ్రామాల్లో జరిగే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య సేవలు అందేలా కృషి చేస్తానన్నారు.

**మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి**

**నల్లగొండ – వర్షం**

నల్లగొండ జిల్లాలో నిన్న సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. నల్లగొండ మండలం అప్పాజిపేట , దండెంపల్లి, అన్నెపర్తి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులపై కప్పిన టార్పాలిన్లు గాలికి కొట్టుకుపోయాయి.

**పీటీసీ నల్లగొండ**

**స్కానింగ్ సెంటర్లు**

లింగ నిర్ధారణ తీవ్ర నేరమని , స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని , రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి రజిత అన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం సలహా సంఘం సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకోసారి తనిఖీలు చేస్తూ స్కానింగ్ సెంటర్ల రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు దృష్టికి వస్తే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసి , క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని తెలియజేశారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా**

**IPL**

ఐపీఎల్ క్రికెట్‌లో ఈరోజు న్యూ చండీగఢ్‌లోని మహారాజా యదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే క్వాలిఫైయర్- 2 మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడుతాయి. ఈ మ్యాచ్ రాత్రి ఏడున్నర గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడుతుంది.

**NSD**